క్లుప్తంగా

వెంకటనారాయణ మృతికి నివాళి



చిల్లు వెంకటనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిల్లు వెంకటనారాయణ శనివారం గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి కడవకల్లు గ్రామానికి చేరుకుని వెంకటనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతు ఆత్మహత్య

పుట్లూరు: దోశలేడు గ్రామానికి చెందిన ఓ రైతు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నొస్సం కేశవరెడ్డి(65) తనకున్న ఏడెకరాలతో పాటు మరో 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశాడు. ఇందుకోసం రూ.17 లక్షలు అప్పు చేశాడు. గత మార్చిలో కురిసిన వడగండ్ల వానతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మానసికంగా ఆందోళనకు గురైన రైతు ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో రైతు మృతదేహం వద్ద నివాళులర్పించారు. రైతు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: పాతకొత్తచెరువు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాషువా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడిన హరిప్రసాద్

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో ఆదివారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. గుత్తి మండలం ఊబిచెర్ల గ్రామానికి చెందిన హరిప్రసాద్ బైక్‌పై స్వగ్రామం నుంచి కల్లూరుకు బైక్‌పై బయలు దేరాడు. గుత్తి శివారులో బైక్‌ను గుత్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో హరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌వీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని రాయలసీమ విమోచన సమితి కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గ్రంథాలయాధికారి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక పఠనం అనిర్వచనీయమైన అనుభూతినిస్తుందన్నారు. పుస్తక పఠనాన్ని దిన చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆర్‌వీఎస్ సభ్యులు జ్ఞానేశ్వరరెడ్డి, హరిప్రసాద్, కోటేశ్వర రావు , గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసానికి నిప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శింగనమల: మండల కేంద్రంలో రైతు కాయల సూర్యనారాయణ చెందిన పశుగ్రాసానికి గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వారం రోజుల నుంచి శింగనమల చెరువు కింద సాగు చేసిన వరి పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతు సూర్యనారాయణ కౌలుకు చేసిన ఐదెకరాల్లోని పశుగ్రాసాన్ని వామిగా వేశాడు. ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాముకు నిప్పుపెట్టారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డి కాలిబూడిదైంది. రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

ఘనంగా బసవేశ్వర జయంత్యుత్సవాలు



గుంతకల్లులో బసవేశ్వరుని శోభాయాత్రలో పాల్గొన్న పీఠాధిపతి కళ్యాణస్వామి, వీరశైవులు



గుంతకల్లులో బసవేశ్వరుడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం సభ్యులు



గుత్తిలో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న వీరశైవులు

గుంతకల్లుటౌన్: బసవేశ్వరుని 890వ జయంత్యుత్సవాలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. వీరశైవ సంఘం ఆధ్వర్యంలో జగజ్యోతి బసవేశ్వరుడి చిత్రపటంతో పురవీధుల గుండా శోభాయాత్రను నిర్వహించారు. కమ్మరచేడు కల్యాణస్వామి సంస్థాన మఠం పీఠాధిపతి కళ్యాణస్వాములు ప్రారంభించిన శోభాయాత్ర స్థానిక కోదండరామాలయం నుంచి పాతగుంతకల్లులోని జగద్గురు మఠం వరకు కొనసాగింది. కళ్యాణస్వాములు మాట్లాడుతూ బసవేశ్వరుడు భక్తి సాహిత్యంలో అనేక విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారన్నారు. తన వచన సాహిత్యంతో వీరశైవ ధర్మం ఔన్నత్యాన్ని కీర్తిస్తూ రాసిన అనేక గ్రంథాలు పండితపామరులకు సైతం దారి దీపాలుగా వెలుగొందాయన్నారు. దేహమే దేవాలయమని, భక్తి కన్నా మంచి ప్రవర్తనే ముఖ్యమని చాటిన ఆ మహనీయుడి అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. వీరశైవ సంఘం అధ్యక్షుడు విరుపాక్షరెడ్డి, ప్రధాన కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి రవికుమార్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, సభ్యులు కాశీనాథ్, బాబురెడ్డి, సోము, వీరభద్రగౌడ్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

జగజ్జ్యోతి బసవేశ్వరుని జయంతి వేడుకలు జంగమ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాతగుంతకల్లులోని జగద్గురు మఠంలో బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వీరభద్రయ్య, అధ్యక్ష, కార్యదర్శులు వీర న్నగౌడ్, పరమేష్, కోశాధికారి ఓంకేశవ, ఆర్గనైజర్ సురేష్‌గౌడ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని పేటలో వెలసిన బసవేశ్వర ఆలయంలో జగత్ గురువు మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వీర శైవులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అర్చకులు తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బసవ మిషన్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ చౌదరి విజయభాస్కర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను పక్కన బెట్టి జ్ఞానం వైపు పయనించాలని లోకానికి చెప్పిన జ్ఞాన జ్యోతి బసవేశ్వరుడన్నారు. స్త్రీ అభ్యుదయం కోసం పాటు పడ్డారన్నారు. దేహమే దేవాలయమని చాటి చెప్పిన సృష్టికర్త బసవేశ్వరుడన్నారు. తదనంతరం బసవేశ్వర ఆలయ నిర్వాహకులు విజయ భాస్కర్, శివ కుమార్ భక్తులందరికీ అల్పాహారం, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళి ధర్‌రెడ్డి ,కోనా ప్రదీప్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, వీర శైవ నాయకులు భాస్కర్, శివ, నాగేంద్రప్ప, శంకర్, బర్మా శివన్న, చిన్నా, నాగరాజు,యాగంటప్ప, బలిజ సంఘం నాయకులు శ్రీకరం గోవిందరాజులు, మారాకుల రమణ, మంజు, రామానాయుడు, హరి, శేఖర్, చిరంజీవి, దేవేంద్ర రాయల్, గిరిగిట్ల ఉత్సవ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో ఆదివారం బసవ జయంతి వేడుకలను వీరశైవ లింగాయతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామి చిత్రచటానికి పూలమాలలు వేసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తుల నంది కోలు నాట్యం ఆకట్టుకుంది.

అనాథలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు, నగదు అందిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన అనాథ పిల్లలు కౌసల్య, కార్తీక్‌కు ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు 18 రకాల నిత్యావసర వస్తువులతోపాటు రూ 5వేలు నగదును అందజేశారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన కంబగిరి, రామేశ్వరి భార్యభర్తలు. నెలక్రితం అనారోగ్యంతో రామేశ్వరి, ఆటో కార్మికుడైన కంబగిరి అనారోగ్యంతో వారం క్రితం మృతి చెందారు. కౌసల్య, కార్తీక్‌కు అమ్మమ్మ సుబ్బమ్మ పెద్దదిక్కు అయ్యింది. వారి పరిస్థితిని గుర్తించి తమ వంతుగా సాయం చేసినట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీహరి తెలిపారు. ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగభూషణరావు, ప్రధాన కార్యదర్శి శంకర్, కన్వీనర్లు చెన్నకేశవులు, శ్రీరంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు లాయర్ కుమారస్వామి, ఓబులేసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షయ తృతీయ



భోగేశ్వరుడిని అలంకరించిన దృశ్యం

పామిడి: స్థానిక భోగేశ్వరాలయంలో ఆదివారం అక్షయ తృతీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ ఆధ్వర్యంలో స్వామికి మహాన్యాస పూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, అభిషేక, విభూది, గంధం, పసుపు, పుష్ప, రుద్రాక్ష, జలాభిషేకం వంటి పూజలు గావించారు. బెంగళూరు వాస్తవ్యులు రాజ్‌కుమార్, మమత అందించిన గులాబీలు, సంపంగి, చామంతి, గన్నేరు, కొబ్బరి పూలతో స్వామివారిని అలంకరించి అష్టోత్తర పూజలు చేశారు. ప్రసన్న పార్వతీదేవికి కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతినాయుడు

పామిడి: మండుతున్న ఎండల దృష్ట్యా వడదెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక మంజు టాకీస్ ఆవరణలో పామిడి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వడదెబ్బపై హోమియో వైద్యశిబిరంతోపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ తిరుపతినాయుడు మాట్లాడుతూ రోజుకు 5 లీటర్ల చొప్పున నీటిని తాగాలన్నారు. నీటిశాతం తగ్గడం వల్ల ఎండవేడికి శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బకు గురికావాల్సి వస్తుందన్నారు. అధికజ్వరం, తలనొప్పి, తల తిరగడం, విపరీతమైన దాహం, నీరసం, గుండె, నాడీ వేగంగా కొట్టుకోవడం, కండరాలు బిగుసుకుపోవడం, కండరాల నొప్పి, ఫిట్స్ రావడం, శ్వాస వేగంగా పీల్చుకోవడం వంటివి వడదెబ్బ లక్షణాలు అన్నారు. చల్లని నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మరసం, చెరుకురసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, ఓఆర్ఎస్ ద్రావణం ఎక్కువగా సేవించడం వల్ల వడదెబ్బను నివారించవచ్చునన్నారు. అనంతరం వడదెబ్బ నివారణకు సంబంధించిన హోమియో మందులను ఆయన ప్రజలకు ఉచితంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, ప్రధాన కార్యదర్శి పీసే జయరామ్‌రావు, డైరెక్టర్స్ సుహాన్, జమీర్ రోషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



విజేతలకు కప్‌ను అందిస్తున్న డీఎస్పీ చైతన్య, ఎస్ఐ రామకృష్ణ

యల్లనూరు: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తాడిపత్రి డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో గండికోట వినోద్ జ్ఞాపకార్థం ఈనెల 4న ప్రారంభమైన క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో యల్లనూరు యూత్ జట్టు, యల్లనూరు పోలీస్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీసుల జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 176 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన యల్లనూరు జట్టు 120 పరుగులు మాత్రమే చేసింది. విన్నర్స్‌కు డీఎస్పీ చైతన్య కప్‌తో పాటు రూ.30 వేల నగదు అందజేశారు. రన్నర్స్‌కు ఎస్ఐ రామకృష్ణ, వినోద్ కుటుంబసభ్యులు తిరుపాల్, రంగస్వామి, చిన్న వంశీ చేతుల మీదుగా రూ.20 వేలు నగదు అందించారు. కార్యక్రమాన్ని హాజరైన వారికి అన్నదానం నిర్వహించారు.

భగవద్గీతపై అవగాహన



సుధాకర్ రెడ్డికి భగవద్గీత అందిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల కేంద్రంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ విశ్వశాంతికి ఏకైక మార్గం భగవద్గీత మాత్రమేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి భగవద్గీత ప్రచారం చేస్తున్నామన్నారు. అనంతరం భగవద్గీత గొప్పతనం, చదవాల్సిన విధానం, భగవద్గీతను అనుసరించాల్సిన విధానాన్ని తెలియజేశారు. జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డికి భగవద్గీతను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బ్రహ్మ, శ్రీనివాస్, శివరాం, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

26న సీపీఐ నిరసన ర్యాలీ

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసనగా ఈ నెల 26న తలపెట్టిన నిరసన ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ గుంతకల్లుకు వస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం ఆయన మాట్లాడారు. మోదీ హఠావో..దేశ్‌కు బచావో అనే నిరసన కార్యక్రమంలో భాగంగా 26వ తేదీ పాతగుంతకల్లు నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, పట్టణ కార్యదర్శి ఎం వీరభద్రస్వామి, పట్టణ, మండల కార్యదర్శులు గోపినాథ్, రాముడు రాయల్ నాయకులు రామాంజినేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్‌నారాయణ ఆదిశంకరుల బోధనలపై రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను సోమవారం ఆవిష్కరించనున్నారు. స్థానిక శారదానగర్‌లోని శంకర మఠంలో సాయంత్రం 6:30 గంటలకు కార్యక్రమం జరగనుంది.

నేరాలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ ఉమా మహేశ్వరరెడ్డి

గుంతకల్లు రూరల్: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ కేసులు నమోదైన వారు తిరిగి నేరాలకు పాల్పడితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి హెచ్చరించారు. కసాపురం పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ ఎస్సై సురేష్, కసాపురం ఎస్ఐ గోపాలుడుతో కలిసి సీఐ మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో నేరచరిత్ర కలిగిన నేరస్తులు జాగ్రత్తగా మసలుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సక్రమ మార్గంలో ముందుకు పోవాలన్నారు. గొడవలు, ఇతరత్రా చట్ట వ్యతిరేక పనులు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అలా కాకుండా నేరాల్లో భాగస్వాములు అయితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నేరాలకు స్వస్తి పలికి మంచి మార్గంలో నడుస్తూ కుటుంబంతో సంతోషంగా గడపాలని సూచించారు.

గుంతకల్లుటౌన్: రౌడీషీటర్లు భవిష్యత్తులో ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య సూచించారు. ఆదివారం వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పాతనేరస్తులు నేరప్రవృత్తిని మార్చుకోవాలన్నారు. కష్టపడి పనిచేసుకుంటూ కుటుంబాల్ని పోషించుకుని పిల్లల్ని బాగా చదివించుకోవాలని సూచించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ అందజేస్తున్న గోపా జగదీష్

గుంతకల్లుటౌన్: ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద అవోపా ఆధ్వర్యంలో జెర్సీ శ్రీధర్ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపాజగదీష్ ప్రారంభించారు. రోజూ వందలాది మంది ప్రజలకు చల్లని మజ్జిగ, చల్లని మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తున్న అవోపా వారి సేవలను గోపా జగదీష్ అభినందించారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు పర్చూరు చెన్నకేశవులు, కార్యదర్శి దారా రామ్మోహన్, కోశాధికారి రాజారమణ, ఇల్లూరు కేదార్, ఇల్లూరు సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు అందరూ హాజరుకావాలని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన,ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివ లింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు కన్నప్ప స్వామి ఆరాధన

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్టపై వెలసిన రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు కన్నప్ప స్వామి ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. అన్నదానం ఉంటుందనిని, భక్తులు పెద్దసంఖ్యలో రావాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి బీజాక్షర హోమం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి బీజాక్షర హోమం నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ఆకుపూజ, పల్లకీసేవ, కుజదోష, కాలసర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర బీజాక్షర హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.3.05 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.3.05 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన సంత నుంచి రూ.1,72,910, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.1,32,500 ఆదాయం వచ్చిందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుకట్ట కింద పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4,330 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకరరెడ్డి తెలిపారు. పట్టుబడిన వారంతా రాజమ్మకాలనీకి చెందిన వారుగా సీఐ తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

స్థానిక వన్‌టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న సున్నంగేరికి చెందిన హరిత అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- బుక్కరాయసముద్రం బొమ్మలాట పల్లికి చెందిన స్వరూప అనే యువతి కుటుంబం ప్రస్తుతం నగరంలోని నవోదయకాలనీలో నివాసం ఉంటోంది.కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ కనిపించలేదు. బాధితులు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో సాయి శివ అనే యువకుడు శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శతాబ్ది ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం శతాబ్ది ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నాలుగురోజుల పాటు వైభవంగా సాగనున్న ఉత్సవాలనువివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు హోమ క్రతువులు, వేదమంత్రాలతో ఆధ్యాత్మిక భావాన్ని ఉట్టిపడేలా ప్రారంభించారు. ఆలయ అనువంశీకులు హోసూరు సుబ్రహ్మణ్యం నేతృత్వంలో సాగిన తొలిరోజు కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి పాల్గొన్నారు. సుందరంగా ముస్తాబు చేసిన ఆలయ ప్రాంగణంలో సుంకేశుల సత్యనారాయణ, నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో 11 హోమ గుండాలను ఏర్పాటు చేసి, 50 మంది వేదపండితులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజలు, పుణ్యావాచనం, నాంది పూజలతో అంకురార్పణ చేశారు. సాయంత్రం శ్రీ లలితా, విష్ణు సహస్రనామపారాయణం వీనుల విందుగా సాగింది. అనంతరం సంస్కృత పండితులు డాక్టర్ నాగత్రిశూల పాణి ఆధ్యాత్మిక ప్రవచనంలో మహాశివుడి లీలామహాత్మాలను వివరించారు. ఈవో రమేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాకే గర్వకారణంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, సోమవారం అహోబిళ పీఠాధిపతులు శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ విశిష్ట అతిథిగా హాజరై అనుగ్రహభాషణం చేస్తారన్నారు. భక్తులు నాలుగు రోజుల కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ధర్మకర్తల మండలి సభ్యులు సుబ్రమణ్యం, చంద్ర, తిమ్మారెడ్డి, నళిని, రాజేశ్వరి, కల్పన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి పాల్గొన్నారు.

27 నుంచి వాసవీ మాత జయంత్యుత్సవాలు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో ఈనెల 27 నుంచి 30 వరకు వాసవీ మాత జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, కార్యదర్శి జయవరం అశ్వత్థరగయ్య తెలిపారు. తొలిరోజు రాత్రి వాసవి మాత బాలకన్యకాదేవి అలంకారం, 28న రాత్రి వీణా వినోదిని అలంకారం, 29న రాత్రి ఆర్యవైశ్య రుషిగోత్ర వృక్ష వాసవీ సౌమ్య స్వరూప అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 30వ తేదీ ఉదయం రుద్రాభిషేకం, గణపతి పూజ, గీతా పారాయణం, 108 కలశాలతో వాసవిమాతకు గంగాభిషేకం, ఆలయోత్సవం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు పంచాయతీ రాజ్ దినోత్సవం

శింగనమల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలా కుమారి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పెద్దపప్పూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఎండీఓ రామకృష్ణ ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

బుక్కరాయసముద్రం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

తాడిపత్రి: మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో సోమవారం ఉదయం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు ఆదివారం తెలిపారు. కార్యదర్శులు ఆయా పంచాయతీల ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి, జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు.

ఇసుక లారీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న లారీతో సెబ్ అధికారులు

తాడిపత్రి అర్బన్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సెబ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి మండలం గంగాదేవి పల్లి వద్ద సెబ్ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తాడిపత్రి నుంచి యాడికి మండలం రాయలచెరువు వైపు వెళుతున్న ఏపీ05 టీఈ 2327 నంబరు గల లారీని తనిఖీ చేశారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని డ్రైవర్ మధు తెలపడంతో లారీని సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.